# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం 13 అక్టోబర్ 2025 పేజీలు 8




మల్లంపేట్ సాయిబాలాజీలో 1100 గజాల్లో జీరో సెట్‌బ్యాకులు..



# బిల్డర్‌లతో ఒప్పందం..?

# చైన్‌మెన్‌లతో సెటిల్మెంట్‌లు..?

## అక్రమకట్టడాల నియంత్రణకి నియమించిన చైన్‌మెన్‌లతో వసూళ్ళ దందా..?





గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో శివారెడ్డి హాస్టల్‌ల అక్రమ నిర్మాణం..

అక్రమ కట్టడాల నియంత్రణకు, చట్టాలు అమలు చేసినా..! అదనంగా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించి నప్పటికీ..! కొందరు లంచగొండి అధికారుల చేతుల్లో..! 2019లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన "టిజి-బిపాస్" చట్టం నిర్వీర్యం చేస్తున్నారు..! ప్రమాదకర లట్టడాలకు సహకరించి పైసా వసూల్ అన్న నానుడికి అద్దం పడుతున్నారు.. చివరికి, అక్రమ కట్టడాల నియంత్రణ కోసం, ప్రత్యేకంగా నియమించిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది (చైన్‌మెన్‌లు) కి సైతం వక్రమార్గాన్ని పరిచయం చేస్తున్నారు.. ఈ చైన్‌మెన్‌లు, "బిల్డర్‌లకు-మున్సిపల్ అధికారులకు" వారధిగా వ్యవహరించి, సెటిల్మెంట్‌ల వ్యవహారం చక్కబెట్టడంలో కీలకంగా మారారని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. "ఆవు చేనులో మేస్తే..! దూడ గట్టున మేస్తుందా..? చేనులోనే మేస్తుంది.. మున్సిపల్ అధికారులు ప్రజలను ప్రమాదంలో పెట్టి, టిజి-బిపాస్ చట్టం నిబంధనలు కాలరాస్తూ..! వసూళ్ళ దందా తారాస్థాయికి చేరుకుంది.. సెట్‌బ్యాకుల స్థలాలకు వెలకట్టి అధికారులు అమ్ముడు పోతున్నారు..! టౌన్‌ప్లానింగ్ అధికారులకు లంచాలు ఇవ్వడానికి, సంబంధిత బిల్డర్‌లు, ప్రజల ప్రాణాలకు ముప్పు తలపెడుతున్నారు.. ఈ వ్యవహారం మొత్తాన్ని సంబంధిత మున్సిపల్ కమిషనర్ చోద్యం చూస్తున్నారే కానీ చర్యలకు ఆదేశించడం లేదు.. కారణం, కమిషనర్‌కి కూడా వాటాలు ఇస్తున్నారేమో అంటూ సందేహాలు లేకపోలేదు ..? అసలు మేడ్చల్ జిల్లాలో లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ ఉన్నట్టా..? లేనట్టా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 12:

- చైన్‌మెన్‌లను సెక్షన్ మార్చడం లో ఎందుకు వెనకడుగు..
- అధికారులకి ఆదాయ వనరులుగా తయారైన ఆ ఇద్దరు చైన్‌మెన్‌లు..?
- టిపిఎస్ సూచనలతో చైన్‌మెన్ సతీష్‌ను సెక్షన్ మార్చకుండా భద్రత..

- దుండిగల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్‌లో అధికారుల బరితెగింపు విధులు..చ
- మల్లంపేట్-గాగిల్లాపూర్‌లో ప్రమాదకర కట్టడాలకు పైసా వసూల్..
- టౌన్‌ప్లానింగ్ అధికారికి అనుకూలమైన చైన్‌మెన్‌లతో అక్రమ కట్టడాల దందా..?
- ఆవు చేలోమేస్తే..! దూడ గట్టున మేస్తుందా..? టిపిఎస్-చైన్‌మెన్ ఎవరికి వారే వసూళ్ళు..?
- మల్లంపేట్ సాయిబాలాజీలో 1100 గజాల్లో భారీ అపార్ట్‌మెంట్‌కి సెట్‌బ్యాకులు జీరో..
- సుమారు రూ.10 కోట్లు విలువైన సెట్ బ్యాకుల స్థలం ఆక్రమణపై అంచనా..?
- గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో శివారెడ్డి హాస్టల్‌ల నిర్మాణాల్లో శరవేగంగా పనులు..!
- వెంటనే బయట రంగులు వేసుకోమని, శివారెడ్డికి టిపిఎస్ సూచించినట్టు వినికిడి..
- ఇప్పటికే టిపిఎస్ సంజునా చలువతో అనుమతులు ఒకరకం, నిర్మాణం మరోరకం..
- టిపిఎస్‌కి నమ్మిన బంటుగా చైన్‌మెన్.. బిల్డర్‌లతో సెటిల్మెంట్‌ల వ్యవహారంలో కీలకం..?

-2లో

# హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



హైదరాబాద్ పెన్ పవర్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. " కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్నంత మాత్రాన రిజర్వేషన్ల విషయంలో ఏం చేయగలడు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్రపతి కూడా ఏం చేయలేరు. మహారాష్ట్రలో మా ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఏం చేయలేకపోయాం. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా అక్కడ.. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది.

-3లో

# కాంగ్రెస్ చేసిన చట్టాలకు ఎన్డీయే తూట్లు పొడిచింది



హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ తీసుకొచ్చిన గొప్ప చట్టాలకు ఎన్డీయే ప్రభుత్వం తూట్లు పొడిచిందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆర్టీఐ చట్టానికి సవరణలు చేసి.. దాని స్వతంత్రతను బలహీన పరిచారని మండిప డ్డారు. ఆర్టీఐను నీరు గార్చేందుకే కమిషనర్ పోస్టులను భర్తీ చేయట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో 11 మంది ఆర్టీఐ కమిషనర్లు ఉండాల్సిన చోట ఇద్దరే ఉన్నారని చెప

-3లో

# బిల్డర్‌లతో ఒప్పందం..? చైన్‌మెన్‌లతో సెటిల్మెంట్‌లు..?



గాగిల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుని అక్రమ నిర్మాణం..



మల్లంపేట్ కేవిఆర్ వ్యాలీలో అదనపు అంతస్తులు, జీరో సెట్‌బ్యాకులు..



మల్లంపేట్‌లో కొత్తగా పై మూడంతస్తులు అక్రమ కట్టడం..

**దుండిగల్ మున్సిపాలిటీలోని చైన్‌మెన్‌లు ఒకే టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో విధులు నిర్వర్తించడం వలన అక్రమ కట్టడాలకు విచ్చలవిడిగా సహకరించడం..! దీనికి తోడు బిల్డర్‌లతో అధికారులు నేరుగా సంప్రదించకుండా..! చైన్‌మెన్‌లను సెటిల్మెంట్‌లకు వినియోగించడం.. ఉన్నపళంగా సెక్షన్ మారిస్తే, అధికారుల గుట్టు రట్టు అవుతుందని, గ్రామాల మార్పుతో మమా అనిపించినట్టు తెలుస్తోంది.. అందుకే ఇతర విభాగాలకు కేటాయించ కుండా, ఒకే సెక్షన్‌లో (టౌన్‌ప్లానింగ్) కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు.. మరోవైపు మల్లంపేట్, గాగిల్లాపూర్ అక్రమ కట్టడాల వ్యవహారంలో టిపిఎస్- చైన్‌మెన్ హస్తం కీలకంగా ఉందని, వివిధ పత్రికల్లో వస్తున్న వార్తా కథనాలకు స్పందించినట్టు వ్యవహరించిన కమిషనర్ వెంకటేష్ నాయక్, అక్రమ నిర్మాణాలు కూల్చకపోయినా..! చైన్‌మెన్ సతీష్‌ను గాగిల్లాపూర్‌కి, బౌరంపేట్ చైన్‌మెన్ వేణుకు మల్లంపేట్ అదనపు బాధ్యత అప్పగించినట్టు సమాచారం.. ఈ మార్పులు టిపిఎస్ సంజునా సూచనలతోనే జరిగినట్లు తెలుస్తుంది.. అయినా టిపిఎస్‌కి నమ్మిన బంటులా ఉన్న చైన్‌మెన్‌లను మున్సిపాలిటీలోని ఇతర సెక్షన్‌లకు ఎలా బదిలీ చేస్తారని ఎద్దేవా చేస్తున్నారు.**

**- మొదటి పేజీ తరువాయి**

దుండిగల్ మున్సిపాలిటీలో అవినీతి అధికారులు రాజ్యమేలుతున్నారు..? చివరికి అక్రమ కట్టడాల నియంత్రణకు నియమించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల (చైన్‌మెన్‌లు)తో బిల్డర్‌ల వద్ద సెటిల్మెంట్‌లు చేయించి, వాళ్ళను కూడా తప్పుడు మార్గంలో విధులు నిర్వర్తించడానికి కారణం అవుతున్నారు.. ప్రభుత్వ పెద్దల అండ ఉందనే ధీమాతో, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని భ్రష్టుపట్టించి, అక్రమ కట్టడాల దందాలే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు.. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో శివారెడ్డి హాస్టల్‌ల నిర్మాణాలకు "టౌన్‌ప్లానింగ్ అధికారిణి టిపిఎస్ సంజునా ప్రత్యేక రక్షణగా నిలుస్తున్నట్టు స్పష్టమవుతుంది.. శివారెడ్డి హాస్టల్‌ల నిర్మాణాల వ్యవహారంలోనూ.. భారీగా ముడుపులు ముట్టాయని, అందుకే చర్యలు తీసుకోవడం లేదని, విమర్శలు వస్తున్నాయి.. అయితే అధికారులు మాత్రం అక్రమ కట్టడాలకు, కాంగ్రెస్- బీఆర్ఎస్ నాయకుల సిఫార్సులు ఉన్నాయని చెప్పడం గమనార్హం..




గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో హాస్టల్ నిర్వహణకు అక్రమ కట్టడం..

## గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో శివారెడ్డి అక్రమ కట్టడాలకు టిపిఎస్ డీల్..?

దుండిగల్ మున్సిపల్ గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో ఐదు అక్రమ కట్టడాలకు టౌన్‌ప్లానింగ్ అధికారి ఒప్పందం కుదుర్చుకుని, సెటిల్మెంట్‌ల వ్యవహారం చైన్‌మెన్‌కి అప్పగించినట్టు సమాచారం.. ఓ బీఆర్ఎస్ నాయకుని అక్రమ కట్టడం 100 గజాల్లో నిర్మించే ప్రమాదకర పేకమేడపై, రెండేళ్ళుగా వార్తలు వచ్చినా మామూళ్ళు పుచ్చుకుని టిపిఎస్ సైలెంట్ అయినట్టు ఆరోపణలు.. తాజాగా గాగిల్లాపూర్ డ్రీమ్‌వన్‌లో శివారెడ్డి హాస్టల్‌ల కోసం, స్టిల్ట్ ం 5 అంతస్తులు అక్రమంగా నిర్మిస్తుంటే..! చర్యలు తీసుకోకుండా రక్షణగా చైన్‌మెన్ ఉన్నట్టు తెలుస్తోంది.. అక్రమ నిర్మాణాల నియంత్రణ సంగతి ఏమోకానీ..! సెటిల్మెంట్‌ల ప్రోత్సాహంలో చైన్‌మెన్‌లు కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు..

## మల్లంపేట్‌లో "చైన్‌మెన్‌కి "ఆస్థాన బిల్డర్‌లు"..!

మల్లంపేట్ సాయిబాలాజీ లేఅవుట్‌లో ఓ బిల్డర్‌కి 2024లోనే..! సుమారు 2000 గజాల స్థలానికి 1100 గజాల్లో ఒక పర్మిషన్..! 900 గజాల్లో మరొక పర్మిషన్, వేరువేరుగా, రెండు అనుమతులు ఇప్పించడంలో చైన్‌మెన్ సతీష్ కీలకంగా వ్యవహరించినట్టు సమాచారం.. కేవిఆర్ వ్యాలీలోనూ అనుమతులకు మించి అదనపు అంతస్తులు, జీరో సెట్‌బ్యాకుల నిర్మాణం కూడా చైన్‌మెన్ కనుసన్నల్లోనే..! మరో ముఖ్య విషయం ఏమిటంటే..! చైన్‌మెన్ ఇప్పించిన ఈ అనుమతులకు టౌన్‌ప్లానింగ్ అధికారికి భారీ మొత్తంలో సెటిల్మెంట్ అయిందని, అందుకే చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నట్టు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. కిందిస్థాయి సిబ్బందిని కంట్రోల్ చేయాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారి విచ్చలవిడిగా ముడుపులు స్వీకరిస్తుంటే..! చైన్‌మెన్‌లు మాత్రం ఎందుకు ఊరుకుంటారు.. అధికారుల దారిలోనే పయనిస్తారుగా..!

# చైన్ లాగితే ట్రైన్ ఆగుతుందని తెలుసు.. కానీ అదెలా పనిచేస్తుందో తెలుసా..!

అత్యవసర పరిస్థితిలో రైలును ఆపేందుకు ప్రతీ కోచ్ లోనూ ఏర్పాటు

150 ఏళ్ల క్రితం బ్రిటిష్ ఇంజనీర్ జార్జ్ వెస్టింగ్ హౌస్ రూపకల్పన

నేరుగా బ్రేక్ ఎయిర్ పైప్ తో చైన్ కు లింక్.. చైన్ లాగితే ఎయిర్ లీక్



**హైదరాబాద్ పెన్ పవర్:**'అత్యవసర పరిస్థితుల్లో రైలును ఆపాలంటే చైన్ లాగుము'.. అనే సూచన రైలు ప్రయాణాల్లో గమనించే ఉంటారు. ప్రతీ కోచ్ లోనూ ఎరుపు రంగులో పైన వేలాడే ఈ చైన్ లాగితే వెంటనే రైలు ఆగుతుంది. ఏదైనా ప్రమాదం సంభవించినపుడో లేక మరేదైనా అత్యవసర పరిస్థితుల్లోనో రైలును వెంటనే ఆపడానికి ఇది ఉపయోగపడుతుంది. ప్రయాణికులకు రైలును నడిపే లోకో పైలట్ కు మధ్య అత్యవసర కమ్యూనికేషన్ వ్యవస్థగా ఇది పనిచేస్తుంది. చైన్ లాగితే ట్రైన్ ఆగుతుందనే విషయం అందరికీ తెలుసు కానీ అదెలా పనిచేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం..

చైన్ లాగినప్పుడు ఏం జరుగుతుందంటే..

ప్రతీ కోచ్ లోనూ ఉండే ఈ ఎరుపు రంగు చైన్ నేరుగా రైలు బ్రేక్ వ్యవస్థకు అనుసంధానమై ఉంటుంది. ప్రయాణికులు ఎవరైనా చైన్ లాగినప్పుడు వెంటనే ఆ కోచ్ లోని బ్రేక్ ఎయిర్ పైప్ వాల్వ్ ఓపెన్ అవుతుంది. పెద్ద శబ్దంతో గాలి బయటకు పోతుంది. దీంతో రైలు ఇంజన్ క్యాబిన్ లోని మీటర్ లో ఎయిర్ ప్రెషర్ తగ్గిపోతుంది. అలారం మోగి లోకో పైలట్ అప్రమత్తం చేస్తుంది.ఈ సూచనను గమనించిన వెంటనే లోకో పైలట్.. రైలు గార్డును, భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేయడానికి మూడుసార్లు హారన్ మోగిస్తాడు. ఆపై బ్రేక్ వేసి రైలును ఆపేస్తాడు. రైలు ఆగిన వెంటనే గార్డు, భద్రతా సిబ్బంది ఏ కోచ్ లోనైతే చైన్ లాగారో ఆ కోచ్ వద్దకు వచ్చి కారణం తెలుసుకుంటారు. అత్యవసర పరిస్థితి అయితే పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటారు. కోచ్ లో మంటలు, కోచ్ లో నుంచి ప్రయాణికులు ఎవరైనా ప్రమాదవశాత్తూ పడిపోవడం.. తదితర పరిస్థితులలో చైన్ లాగి రైలు సిబ్బందిని అప్రమత్తం చేయవచ్చు. ఆకతాయితనానికో లేక అప్రాధాన్యమైన విషయాలకో చైన్ లాగితే మాత్రం రూ.వెయ్యి జరిమానా లేదా జైలు శిక్ష లేదా రెండూ కలిపి విధించే అవకాశం ఉంటుంది.

# ఉరేసుకుంటున్నట్లు సెల్ఫీ పంపిన ప్రియురాలు.. భయంతో పురుగుల మందు తాగిన ప్రియుడు.. కర్నూలులో విషాదం

భార్యను వదిలేసి అతడు.. భర్తను వదిలేసిన ఆమె.. ఇద్దరూ సహజీవనం

పెళ్లి చేసుకోవాలని ప్రియుడిపై ఒత్తిడి తెచ్చేందుకు ఉరేసుకుంటున్నట్లు బెదిరింపు

పురుగుల మందు తాగి చనిపోయిన ప్రియుడు.. మరుసటి రోజు ప్రియురాలు కూడా ఆత్మహత్య



**హైదరాబాద్ పెన్ పవర్:**వాళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు.. పెద్దలు ఒప్పుకోకపోవడంతో విడిపోయారు. ఇద్దరికీ వేర్వేరుగా పెళ్లిళ్లయ్యాయి. అయినా ప్రేమను చంపుకోలేక తమ భాగస్వాములను వదిలేసి వేరేచోట కాపురం పెట్టారు. ఈ క్రమంలోనే పెళ్లి కోసం ప్రియురాలు ఒత్తిడి చేయడంతో భయాందోళనకు గురైన ప్రియుడు పురుగుల మందు తాగాడు.. ఈ విషయం తెలిసి ప్రియురాలు కూడా విషం తాగింది. మూడు రోజుల వ్యవధిలో ఇద్దరూ మరణించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డిలో ఈ విషాదం చోటు చేసుకుంది.

**వివరాల్లోకి వెళితే..**

గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన ధనుంజయ గౌడ్(27), అదే గ్రామానికి చెందిన శశికళ ప్రేమించుకున్నారు. శశికళ వయసు ఎక్కువ కావడంతో వారి వివాహానికి పెద్దలు అంగీకరించకలేదు. ఇద్దరూ వేరేవారితో పెళ్లిళ్లు చేసుకుని జీవనం సాగించారు. ఆ తరువాత కూడా వారి మధ్య వివాహేతర బంధం కొనసాగింది. ఇది ఇరువురి కుటుంబాల్లోనూ చిచ్చురేపింది. ధనుంజయ్ భార్య గొడవపడి పుట్టింటికి వెళ్ళిపోయింది. శశికళ తన భర్త, ఇద్దరు పిల్లలను వదిలేసి ఎమ్మిగనూరులో మెడికల్ షాప్ నడుపుతున్న ధనుంజయ్ వద్దకు వచ్చేసింది.

**ఉరి వేసుకుంటున్నట్లు సెల్ఫీ..**

ధనుంజయ గౌడ్ ఆమెను ఓ హాస్టల్ లో ఉంచాడు. అయితే, హాస్టల్‌లో ఉండలేకపోతున్నానని, పెళ్లి చేసుకొని ఇంటికి తీసుకువెళ్ళాలని శశికళ ఒత్తిడి చేస్తంది. ధనుంజయ్ ను బెదిరించేందుకు మెడకు ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ ఫోటోను పంపింది. ఆమె చనిపోతే తాను జైలుకు వెళ్ళాల్సి వస్తుందని భయపడ్డ ధనుంజయ గౌడ్.. గ్రామ శివార్లలోని పొలాల్లోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. గ్రామస్థులు గమనించి ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ధనుంజయ గౌడ్ మృతి చెందాడు. ధనుంజయ గౌడ్ మరణం తట్టుకోలేక శశికళ కూడా పురుగుల మందు తాగింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత మృతి చెందింది.

## కాంగ్రెస్ చేసిన చట్టాలకు ఎన్డీయే తూట్లు పొడిచింది

- మొదటి పేజి తరువాయి

...ారు. ఆర్టీఐ తీసుకొచ్చి 25 ఏళ్లయిన సందర్భంగా దాని గొప్పతనం తెలియజేయాలనుకున్నామని పేర్కొన్నారు.

దూరదృష్టితో యూపీఏ ప్రభుత్వం సమచారహక్కు చట్టం తీసుకొచ్చిందన్నారు.

## హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టులో.. రిజర్వేషన్లకు 50శాతం క్యాప్ పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోనే. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతం క్యాప్‌నకు వ్యతిరేకంగా వాదనలు వినిపించడంలో విఫలమైంది. ఇప్పుడు హైకోర్టులో వాదనలు వినిపించడంలో విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తాం. బీసీ రిజర్వేషన్ల కోసం భాజపా పూర్తి మద్దతు ఉంటుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థి కోసం 3 పేర్లను జాతీయ పార్టీకి పంపించాం. పార్లమెంటరీ బోర్డు మీటింగ్ తర్వాత అభ్యర్థి ప్రకటన ఉటుంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## స్వీట్లు తినిపించిన చేతితోనే.. ముగ్గురు పిల్లల గొంతు కోసి చంపిన తండ్రి..



**హైదరాబాద్ పెన్ పవర్:**తమిళనాడులో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. భార్య విడిచి వెళ్లిపోయిందని కోపంతో ముగ్గురు పిల్లలను గొంతు కోసి చంపేశాడు ఓ తండ్రి. తమిళనాడులోని తంజావూర్ జిల్లా ముదుక్కూర్ సమీపంలో గోపాలసముద్రంలో చోటు చేసుకుంది ఈ ఘటన. ఆదివారం ( అక్టోబర్ 12 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..గోపాలసముద్రం ప్రాంతానికి చెందిన వినోద్ కుమార్ ఫోటోగ్రాఫర్ గా పని చేస్తున్నాడు. వినోద్ కు నిత్యతో వివాహం కాగా.. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ముగ్గురు పిల్లలతో వినోద్, నిత్యల కాపురం సజావుగా సాగుతుండగా.. నిత్యకు తిరువారూర్ జిల్లా మన్నార్ కుడికి చెందిన ఒకరితో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. ఆరునెలల కిందట ఆమె భర్త, పిల్లలను వదిలేసి ఆ వ్యక్తితో వెళ్లిపోయింది నిత్య. వినోద్ కొద్దిరోజుల కిందట భార్యను కలిసి తిరిగి రావాలని కోరాడు. ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురయ్యాడు.

ఈ క్రమంలో వినోద్ పిల్లలకు స్వీట్లు తెచ్చి తినమని ఇచ్చాడు. స్వీట్లు తింటుండగానే.. కత్తితో ముగ్గురు పిల్లల గొంతు కోసి చంపాడు వినోద్. ఏం జరుగుతుందో తెలిసేలోపే ముగ్గురు పసిబిడ్డలు రక్తపుమడుగులో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.అనంతరం పోలీస్ స్టేషన్ కి వెళ్లి లొంగిపోయాడు వినోద్.ఈ ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు స్థానికులు. తమ పంతాల కోసం అభం శుభం తెలియని పసిపిల్లలను అన్యాయంగా చంపేశాడంటూ వినోద్ పై మండిపడుతున్నారు బంధువులు, స్థానికులు. పిల్లల మరణానికి కారణమైన తండ్రికి.. పరోక్షంగా కారణమైన తల్లి నిత్యను కూడా కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు బంధువులు.

# 'స్థానిక ఎన్నికలు'.. అసలు రేవంత్ ప్లాన్ ఏంటి?

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నెలకొన్న అనిశ్చితి తుది దశకు చేరుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.9పై హైకోర్టు స్టే విధించడంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేస్తూ, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్**

హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే సీఎం రేవంత్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా "బీసీలకు 42% రిజర్వేషన్లు తప్పించరాదు" అనే నిశ్చయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసేందుకు అవసరమైన పత్రాలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ తరఫున ఈ పోరాటానికి నాయకత్వం వహించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో పాటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉంది. అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి పర్యవేక్షణలో, సుప్రీంకోర్టులోని సీనియర్ న్యాయవాదుల ద్వారా ఈ కేసులో వాదనలు వినిపించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.




**రేవంత్ ప్లాన్: 'ట్రిపుల్ టెస్ట్'తో రిజర్వేషన్ల సాధన**

సీఎం రేవంత్ ప్లాన్ చాలా స్పష్టంగా ఉంది. "బీసీలకు గరిష్ట రిజర్వేషన్లతోనే ఎన్నికలు జరగాలి". ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రభుత్వం 'ట్రిపుల్ టెస్ట్' ప్రమాణాలను బలంగా వినియోగించాలని వ్యూహం రచించింది. బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలంటే ట్రిపుల్ టెస్ట్ నిబంధనను పాటించాలన్న సుప్రీంకోర్టు సూచన ఉంది. రేవంత్ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక కమిషన్ ద్వారా బీసీల జనాభా వివరాలు సేకరించి, ఆ నివేదిక ఆధారంగానే 42% రిజర్వేషన్లు కేటాయించింది. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ఎదుట బలమైన ఆధారంగా వాదించాలని సర్కార్ సిద్ధమైంది. రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని మించకూడదన్న నిబంధనపై మినహాయింపు సాధ్యాసాధ్యాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

**ఎన్నికల కమిషన్ గందరగోళం**

ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్ర ఎన్నికల సంఘం గందరగోళంలో పడింది. హైకోర్టు స్టే విధించినప్పటికీ, మధ్యంతర ఉత్తర్వుల్లో ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడం లేదని చెప్పింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల ఆధారంగా ముందుకు వెళ్లాలా? లేక 50 శాతం పరిమితి కింద ఓపెన్ కేటగిరీలతో కొనసాగాలా? అనే విషయమై %ూజుజ% న్యాయనిపుణులతో చర్చలు జరుపుతోంది. ఏదేమైనా, ఎన్నికల భవిష్యత్తు ప్రస్తుతం సుప్రీంకోర్టు ఇచ్చే తుది తీర్పుపైనే ఆధారపడి ఉంది. "బీసీలకు సరైన హక్కులు దక్కే వరకు పోరాడతాం" అన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలు, ఈ రిజర్వేషన్ల పోరాటంపై ప్రభుత్వ పట్టుదలను స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ రాజకీయాలను ఈ పోరాటం మరోసారి కుదిపేస్తుండగా సుప్రీంకోర్టు తీర్పు కోసం యావత్ రాష్ట్రం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

# గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో ఉద్రిక్తత.. రోగి మృతితో బంధువుల ఆందోళన




- గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత
- కాలేయ మార్పిడి చికిత్స పొందుతూ మురళీధర్ అనే వ్యక్తి మృతి
- వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణించాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- 45 రోజుల చికిత్సకు రూ.85 లక్షలు వసూలు చేశారని ఆవేదన
- జీవన్‌దాన్‌లో వయసు తప్పుగా నమోదు చేయడం వల్లే సమస్యలొచ్చాయని ఆరోపణ
- రూ.14 లక్షలు కట్టించుకున్నాకే మరణవార్త చెప్పారని బంధువుల కన్నీరు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రి వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాలేయ మార్పిడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందడంతో, వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. భారీగా డబ్బులు వసూలు చేసి, చివరికి ప్రాణాలు తీశారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

వివరాల్లోకి వెళితే, కుత్బుల్లాపూర్‌కు చెందిన మురళీధర్ (40) కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. మెరుగైన చికిత్స కోసం 45 రోజుల క్రితం ఏఐజీ ఆసుపత్రిలో చేరారు. కాలేయ మార్పిడి అవసరమని వైద్యులు చెప్పడంతో, అవయవదానం కోసం జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, మురళీధర్ వయసు 40 ఏళ్లు కాగా, ఆసుపత్రి సిబ్బంది పొరపాటున 60 ఏళ్లుగా నమోదు చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ తప్పిదం వల్ల అవయవదాతలు ఎవరూ ముందుకు రాలేదని, దీంతో చివరికి అతని భార్యే కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకొచ్చారని వారు తెలిపారు. ఈ 45 రోజుల చికిత్స కోసం తాము సుమారు రూ.85 లక్షలు చెల్లించామని, ఉన్న ఒక్క ఇంటిని అమ్మి డబ్బు కట్టామని మృతుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, శనివారం మరో రూ.14 లక్షలు చెల్లించిన తర్వాతే మురళీధర్ మృతి చెందినట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. డబ్బు కట్టించుకున్న తర్వాత మరణవార్త చెప్పడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం, జీవన్‌దాన్‌లో తప్పుడు సమాచారం నమోదు చేయడం వల్లే మురళీధర్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనతో ఆసుపత్రి వద్ద కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్.. కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడం, వివాహ వేడుకల కారణంగా హైవేపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. సర్వీస్ రోడ్డు, ఫ్లైఓవర్ నిర్మాణ పనుల వల్ల చిట్యాల, పెద్దకాపర్తి, పంతంగి టోల్ ప్లాజా, చౌటుప్పల్ దగ్గర వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. కిలో మీటర్ల మేర వెహికల్స్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వెహికిల్స్ స్లోగా కదులుతుండటంతో.. ఇంకెప్పుడొస్తుందా హైదరాబాద్ అన్నట్లుగా ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. చౌటుప్పల్ ఏరియాలో వాహనాలు బారులు తీరాయి. పంతంగి టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో.. ట్రాఫిక్ పోలీసులు క్లియర్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. భారీ సంఖ్యలో వచ్చే వాహనాలను త్వరగా పంపించేందుకు టోల్ ప్లాజా దగ్గర ఎక్కువ గేట్ల నుంచి హైదరాబాద్ వైపు వచ్చే వాహనాలను పంపిస్తున్నారు. ట్రాఫిక్‌లో అంబులెన్స్‌లు సైతం చిక్కుకుపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## గాజా శాంతి సమావేశానికి..ప్రధాని మోదీకి ఆహ్వానం.. ట్రంప్ కూడా వస్తున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:**గాజా శాంతి శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీకి ఆహ్వానం అందింది. ఈజిప్టులోని షర్మ్? ఎల్? షేక్? లో జరగనున్న గాజా శాంతి సదస్సుకు హాజరు కావాలని ఈజీప్ట అధ్యక్షుడు అబ్దేల్? ఫత్తా ఎల్? సిసి అధికారిక ఆహ్వానం పంపారు. అయితే ఈ సమావేశానికి స్వయంగా మోదీ హాజరయ్యే కనిపించడం లేదు. భారత్? తరపున ఆయనకు బదులుగా విదేశాంగ మంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి కీర్తీ వర్దన్? సింగ్? ను ఈ సమావేశానికి హాజరు కానున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్? ట్రంప్?, ఈజిప్ట అధ్యక్షుడు ఎల్? సీసీ సంయుక్తంగా అధ్యక్షత వహించే ఈ సమావేశానికి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెర్రెస్?, యూకె ప్రధాని కీర్ స్టార్మర్?, ఇటాలియన్? ప్రధాని జార్జియా మెలోనీ, స్పానిష్? ప్రధాని పెడ్రో సాంచెజ్?, ఫ్రెంచ్?అధ్యక్షుడు ఇమ్మానియేల్? మాక్రాన్?సహా 20 దేశాల నాయకులు హాజరుకానున్నారు.

**ఈజిప్లులో గాజా శాంతి సమావేశం..**

గాజాలో యుద్ధాన్ని ముగింపుకు ఒప్పందాన్ని చేసేందుకు ఈజిప్ట సోమవారం ( అక్టోబర్? 13) ఎర్ర సముద్రంలోని రిసార్ట్? నగరమైన షర్మ్? ఎల్? షేర్? లో అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఈజిప్ట అధ్యక్షుడు తెలిపారు.

అయితే ఈ సమావేశంలో యుద్ధాన్ని అధికారికంగా ఎలా ముగించగలదో అస్పష్ట ఉండటంతో హమాస్ ఇకపై గాజా పాలనలో ఎటువంటి ముప్పును కలిగించదని, దాని నుండి ఎటువంటి ప్రమాదం లేదని సంతృప్తి చెందే వరకు యుద్ధాన్ని ముగించడానికి అంగీకరించబోమని ఇజ్రాయెల్ తెలిపింది.

**హమాస్? హాజరవుతుందా?**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రూపొందించిన ప్రణాళికతో కొన్ని విభేదాల కారణంగా ఈజిప్టులో గాజా శాంతి ఒప్పందంపై అధికారిక సంతకం కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్ ప్రకటించింది.

# టీబీ(క్షయ) రోగులకు WHO కొత్త గైడ్ లైన్స్.. ముఖ్యంగా ఫుడ్ విషయంలో



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచ ఆరోగ్య సంస్థ టీబీ(క్షయ వ్యాధి) చికిత్సకు కొత్త మార్గదర్శకాలను వెల్లడించింది. ఇప్పుడు టీబీ రోగుల సంరక్షణకు పోషకాహారం కీలకం అని ప్రకటించింది. కొత్త విధానంలో టీబీ రోగులు ,వారి కుటుంబాలకు ఆహార సాయం అందించనుఉంది. త్వరగా కోలుకోవడం, టీబీ వ్యాప్తిని తగ్గించడమే లక్ష్యంగా ఈ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది WHO. బెంగళూరు డాక్టర్లు డాక్టర్ ఉమేష్ మోహన్ , డాక్టర్ శిల్పా అరాలికర్ పరిశోధన లకు అనుగుణంగా కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది ప్రపంచ ఆరోగ్య సంస్థ.

**పోషకాహారం ప్రధాన అంశంగా చికిత్స..**

అక్టోబర్ ప్రారంభంలో TB సంరక్షణలో పోషకాహార పాత్రను నొక్కి చెప్పే కొత్త మార్గదర్శకాలను WHO విడుదల చేసింది.గతంలో ప్రధానంగా ఔషధ చికిత్సపై దృష్టి పెట్టేవారు. ఈసారి పోషకాహారం కీలకం అని ప్రకటించింది. ముఖ్యమైన సిఫార్సులలో పోషకాహారం లభించని ప్రాంతాల్లో %టిదీ% రోగుల కుటుంబ సభ్యులకు ఆహార అందించడం. TB చికిత్స ఫలితాలు రోగులు ,వారి కుటుంబాల పోషక స్థితితో దగ్గరి సంబంధం కలిగి ఉన్నాయని గుర్తించిన WHO.. కొత్త విధానాల ద్వారా %టిదీ% వ్యాధిని తగ్గించడం ,ప్రపంచవ్యాప్తంగా రికవరీ రేట్లను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది.


**ది పాత్ బ్రేకింగ్ స్టడీ..**

భారత్ లో అధిక క్షయవ్యాధి ఉన్న ప్రాంతాల్లో బెంగళూరు డాక్టర్లు డాక్టర్ ఉమేష్ మోహన్ , డాక్టర్ శిల్పా అరాలికర్ పరిశోధనలు చేశారు. క్షయ రోగులకు పోషకాహారం అందించి చికిత్స చేస్తే మెరుగైన ఫలితాలు వచ్చాయని నిరూపించారు. క్షయవ్యాధి పురోగతికి కీలకమైన ప్రమాద

కారణమైన పోషకాహార లోపంపై వారు దృష్టి సారించారు.పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు క్షయవ్యాధికి ఎక్కువగా గురవుతారని.. పోషకాహార

లోపం పరిష్కరించకుంటే కోలుకోవడం ఆలస్యం అవుతుందని నిర్ధారించారు. ఈ డాక్టర్ల పరిశోధనలు క్షయ సంరక్షణ ప్రోటోకాల్‌లలో చాలా కాలంగా ఉన్న అంతరాన్ని అంటే వైద్య చికిత్సను పోషకాహార అత్యవసర అవసరాన్ని హైలైట్ చేశాయి.

# గూగుల్ క్రోమ్ లో కొత్త ఫీచర్.. అన్ వాంటెడ్ నోటిఫికేషన్లకు చెక్




**హైదరాబాద్ పెన్ పవర్:**వినియోగదారులకు Google Chrome గుడ్ న్యూస్ చెప్పింది. క్రోమ్ ఓపెన్ చేసినపుడు తరుచుగా వచ్చే వెబ్ సైట్లను నుంచి వచ్చే నోటిఫికేషన్లను కట్టడి చేసేందుకు కొత్త ఫీచర్? ను తెచ్చింది. ఈ అప్‌డేట్ ఆండ్రాయిడ్, డెస్క్‌టాప్ వెర్షన్లు రెండింటికీ బ్రౌజర్‌లో అందుబాటులోకి వస్తుంది. ఇది తరచుగా బ్రౌజింగ్‌కు అంతరాయం కలిగించే పాప్-అప్ వార్నింగ్ నోటిఫికేషన్లను తగ్గించడంలో కస్టమర్లకు సాయపడుతుంది.

**వాతావరణ పరికరాలు**

ఒక సైట్ తరచుగా నోటిఫికేషన్‌లను పంపిన ప్పుడు వాటిని మనం తిరస్కరించినట్లయితే అంటే మనం వాడని వెబ్ సైట్ల పాప్? అప్ నోటిఫికేషన్లు రాకుండా Chrome నియం త్రిస్తుంది. అయితే ఇది ఇన్‌స్టాల్ చేయబడిన వెబ్ యాప్‌లను వర్తించదు. ఎందుకంటే అవి అప్డేట్? లను అందించే అవకాశం ఉంటుంది.

ఈ మార్పు సెక్యూరిటీ చెక్? టూల్?పై రూపొందించారు. ఇది ఇప్పటికే వాడకుండా ఉన్న వెబ్? సైట్? లనుంచి కెమెరా, లోకేషన్? అనుమతులను రద్దు చేసింది. ఇప్పుడు నోటిఫికేషన్లకు విస్తరించింది. వినియోగదారులకు అనవసరమైన నోటిఫికేషన్లను తగ్గించడం లక్ష్యంగా చేసుకొని Google ఈ ఫీచర్ ను తీసుకొచ్చింది. Chrome సైట్ ఈ అనవసర వెబ్ సైట్ నోటిఫికేషన్లను రద్దు చేసినప్పుడు కస్టమర్లకు తెలియజేస్తుంది. సెక్యూరిటీ చెక్ ప్యానల్ ద్వారా లేదా నేరుగా సైట్ నుంచి వాటి నియంత్రణకు, కావాలనుకున్నపుడు ఆటోమేటిక్ క్యాన్సిల్ ఫీచర్ ను ఆఫ్ చేసే ఎంపిక కూడా ఉంది.తమ కస్టమర్లు బ్రౌజింగ్‌ను ఎటువంటి ఆటంకం లేకుండా చేసుకునేందుకు వీలుగా Google ఈ కొత్త ఫీచర్? ను తీసుకొచ్చింది. స్వయంగా అనవసర నోటిఫికేషన్లను నియంత్రించడం ద్వారా వినియోగదారులకు క్లీన్ ఎక్స్? పీరియెన్స్? ను అందించడంGoogle Chrome లక్ష్యం.

# ఈ ఏడాది ధన్ తేరస్ అక్టోబర్ 18 లేదా 19న జరుగుతుందా?

**హైదరాబాద్ పెన్ పవర్:**దీపావళి ప్రారంభాన్ని సూచించే ధన్ తేరస్ లేదా ధనత్రయోదశి ఈ ఏడాది శనివారం(అక్టోబర్ 18) వస్తుంది. ఈ రోజున, హిందూ భక్తులు లక్ష్మీదేవిని ,కుబేరుడిని పూజిస్తారు. తద్వారా వారు అదృష్టం ,శ్రేయస్సును కోరుకుంటారు. ధన్ తేరస్ నాడు బంగారం, వెండిని కొనుగోలు చేయడం శుభప్రదంగా భావిస్తారు ప్రత్యేకించి లక్ష్మీదేవి, గణేశ విగ్రహాలను కొనుగోలు చేయడం మరింత శుభప్రదంగా భావిస్తారు.

ధన్‌తేరస్ పూజ ముహూర్తం: శనివారం సాయంత్రం 7:16 నుంచి సాయంత్రం 8:20 వరకు

**ప్రదోషకాలం:** సాయంత్రం5:48 నుంచి 8:20 సాయంత్రం వరకు

వృషభ కాలం: సాయంత్రం7:16 నుంచి సాయంత్రం9:11 వరకు

త్రయోదశి తిథి ప్రారంభం: అక్టోబర్ 18, 2025న మధ్యాహ్నం 12:18

త్రయోదశి తిథి ముగింపు: అక్టోబర్ 19, 2025న మధ్యాహ్నం 1:51



ఈ నెల (అక్టోబర్) 18న వచ్చే ధన త్రయోదశి (ధన్ తేరస్) నుంచి కుజ, శుక్ర, బుధ గ్రహాలు బాగా అనుకూలంగా మారుతున్నందువల్ల కొన్ని రాశులకు ఒకటికి రెండుసార్లు ధన యోగాలు, మహా భాగ్య యోగాలు పట్టే అవకాశం ఉంది. ధన్ తేరస్ నుంచి 45 రోజుల పాటు ఈ రాశుల వారికి ఆదాయం వృద్ధి ,ఆర్థిక సమస్యలు పూర్తిగా పరిష్కారం కావడం, ఆస్తిపాస్తులు కలిసి రావడం, గృహ, వాహన యోగాలు కలగడం, అన్నిటికంటే ముఖ్యంగా మనసులోని ప్రధానమైన కోరికలు నెరవేరడం వంటివి జరుగుతాయి. ధన్ తేరస్ రోజున ఇతర రాశులవారితో పాటు ఈ రాశుల వారు కూడా తప్పకుండా లక్ష్మీదేవిని ప్రార్థించడం మంచిది. మేషం, వృషభం, కర్కాటకం, తుల, వృశ్చికం, ధనూ రాశుల వారి జీవితాల్లో ఈ పండుగ సుఖ సంతోషాలను నింపబోతోంది.

# తల్లికి అన్నం పెట్టని..కొడుకు ఇంటి ఎదుట వృద్ధురాలి ఆందోళన



**హైదరాబాద్ పెన్ పవర్:** కన్నకొడుకు అన్నం పెట్టలేదని తల్లి రోడ్డెక్కిన దుస్థితి మంచిర్యాల జిల్లాలో చోటు చేసుకుంది. ఉద్యోగి అయి ఉండి కూడా తల్లికి పట్టెడు అన్నం పెట్టని కొడుకు ఇంటి ఎదుట బైఠాయించింది వృద్ధురాలు. తన పేరున ఉన్న 4 ఎకరాల భూమిని సైతం ఆక్రమించుకుని ఇంటినుంచి బయటికి నెట్టేయడం దిక్కుతోచని స్థితిలో ఆందోళనకు దిగింది. వివరాల్లోకి వెళితే..

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్? బస్తీలో కొడుకు అన్నం పెట్టడం లేదని అతని ఇంటి ఎదుట బైఠాయించి నిరసన చేపట్టింది పొట్ట బాలమ్మ అనే వృద్ధురాలు. బాలమకు నలుగురు కొడుకులు..ముగ్గురు కొడుకులు చనిపోగా..ఉన్న కొడుకు పొట్ట రమేష్?..సింగరేణి ఉద్యోగి..భర్త వారసత్వంగా సింగరేణిలో ఉద్యోగం పెట్టించింది పొట్ట బాలమ్మ.ఉన్న ఇంటిని కూడా లాక్కొని కిరాయిలకు ఇచ్చి..ఇంటిపై రేకుల షెడ్డులో బాలమ్మను ఉంచారు. బాలమ్మ పేరున ఉన్న 4 ఎకరాల భూమిని కూడా ఆక్రమించుకున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఒంటరిగా జీవిస్తోంది బాలమ్మ. వృద్ధాప్యంతో తన పనులు తాను చేసుకోలేని పరిస్థితుల్లో పట్టెడు అన్నం పెట్టేవాళ్లు లేక నానా అవస్థలుపడుతోంది బాలమ్మ. దిక్కుతోచని స్థితిలో కొడుకు ఇంటిముందు ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలని కొడుకు రమేష్? ఇంటిముందు నిరసన తెలిపింది బాలమ్మ.

# మిత్రుని కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం



**హైదరాబాద్ పెన్ పవర్:**గూడూరు మండలం మరిమిట్ట గ్రామంలో దాసరి అజిత్ కుమార్ అనారోగ్యంతో మరణించగా అతని పదవ తరగతి మిత్రుడు కందికట్ల రంజిత్ వారి దశదిన కర్మకు హాజరయ్యి వారి కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం వారి కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో ఉన్నప్పుడు ఆదుకోవడంలో స్నేహితులు ముందుంటారని నిరూపించారు. గ్రామస్తులు కందికట్ల రంజిత్ అభినందించారు. తోటి కుటుంబ సభ్యులే సహాయం చేయని ఈ రోజులలో ఒక స్నేహితునికి మరో స్నేహితుడు అండగా నిలబడడం ఎంతో గొప్పవిషయం అన్నారు అనంతరం వారి కుటుంబానికి నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అధైర్య పడద్దని ధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# నిండు జీవితానికి.. రెండు చుక్కలు...



**హైదరాబాద్ పెన్ పవర్:**కుత్బుల్లాపూర్ నియోజకవార్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని ఖైసర్ నగర్ డబల్ బెడ్ రూమ్ సొసైటీ లో నిర్వహిస్తున్న పోలియో చుక్కల కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి హాజరై పిల్లలకు అందిస్తున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ తల్లితండ్రులందరు బాధ్యతగా తీసుకుని ఐదు ఏళ్ల వయస్సు లోపు ఉన్న పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పోలియో వ్యాధికి టీకా తప్ప మరోక పరిష్కరం లేదు కాబట్టి పిల్లల ఆరోగ్యం విషయంలో అశ్రద్ద వహించకుండా తప్పనిసరిగా పోలియో డ్రాప్స్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిద్దనోల సంజీవ రెడ్డి ,బహదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్,యాదగిరి ,శామీర్ షఫీ ,శ్రీనివాస్,ఫారీన్ ఖాన్ పాల్గొన్నారు.

## మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రతి ఆదివారం హనుమద్ హోమం




**హైదరాబాద్ పెన్ పవర్:**ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం, గురవాయిగూడెం గ్రామము నందు వేంచేసియున్న శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానము నందు “హనుమద్ హోమం” ఆలయ అర్చకులు, వేద పండితులు ఆద్వర్యములో అత్యంత వైభవముగా జరిగినది. ఈ హనుమద్ హోమం కార్యక్రమము నందు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనియున్నారు.

మద్ది ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో ఈ హనుమద్ హోమం ప్రతీ ఆదివారం భక్తులకు ఆర్జిత సేవగా దేవస్థానం వారు నిర్ణయించారు. ఈ హనుమద్ హోమ కార్యక్రమములో ప్రత్యక్షంగా కానీ పరోక్షముగా కానీ పాల్గొన్న వారికి మానసిక, శారీరక ఆరోగ్యం తో పాటు మానసిక ప్రశాంతత కలుగునని, విద్యార్ధులకు లకు విద్యా ప్రాప్తి కలుగునని, కుటుంభ శక్యత, అన్యోన్య దాంపత్యం కలిగి సంతానం కలిగి సర్వత్ర విజయ చేకూరునని విశ్వాసం.
కనుక భక్తులు దేవస్థానం నందు ప్రతీ ఆదివారం జరుగు ఈ హనుమద్ హోమం నందు పాల్గొనగలరు, ఈ హూమకార్యక్రమం పర్యవేక్షణ ఆలయ పర్యవేక్షకులు కూరగంటి రంగారావు , పర్యవేక్షణలో జరిగినట్లు ఆలయ సహాయ కమీషనరు , కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి.చందన తెలియజేసినారు.

## అభిమానులు మధ్య ఎర్రకోట జగనన్న జన్మదిన వేడుకలు.



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక మాజీ ఎమ్మెల్యే స్వగృహం నందు మాజీ ఎమ్మెల్యే కె. చెన్నకేశవ రెడ్డి తనయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ,ఎమ్మిగనూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు తనయులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనాయకులు పవన్ కళ్యాణ్ రెడ్డి,రాజీవ్ రెడ్డి తో కలసి పెద్దఎత్తున పాల్గొన్న అభిమానులు,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు మధ్య వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి , ఎమ్మిగనూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.అనంతరం పెద్దఎత్తున పాల్గొన్న అభిమానులు,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు భారీ గజమాలలు, పూలమాలలు, శాలువాలతో ఎర్రకోట జగనన్న కు సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో చేసుకోవాలని అకాక్షించారు. ఈ సందర్బంగా నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ
ఎంతో తమ అభిమానం ను చూపిస్తూ, జన్మదిన వేడుకలలో పాల్గొని విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఫుట్‌బాల్ క్రీడాకారుడికి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎమ్మిగనూరు పట్టణం ఫుట్‌బాల్ క్రీడాకారుడు బి.సిద్దు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిన ఎమ్మిగనూరు శాసనసభ్యులు బి.వి జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు బి.వి.యూత్ ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వాల్మీకి రామకృష్ణ నాయుడు ఆదివారం గాయపడిన క్రీడాకారుడు బి.సిద్దు చికిత్స పొందేందుకు రూ.5000/- నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి రామకృష్ణ నాయుడు, ఫుట్బాల్ కోచ్ మాబన్న లు మాట్లాడుతూ ఫుట్బాల్ క్రీడాకారుడు సిద్దు చికిత్స పొందేందుకు ఎమ్మెల్యే బి.వి జయ నాగేశ్వర రెడ్డి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారని తెలిపారు. ఫుట్బాల్ క్రీడాకారుడు బి.సిద్దు అండర్ 19,అండర్ 20 లో 2 నేషనల్స్ లో ఆడారు.ఇలాంటి "క్రీడాకారులు సమాజానికి గౌరవం తెస్తారని,వారిని ప్రోత్సహించడం మనందరి బాధ్యతని తెలిపారు.భవిష్యత్ లో క్రీడాకారులకు బి.వి.యూత్ ఫుట్బాల్ అసోసియేషన్ అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో క్రీడాకారుని కుటుంబ సభ్యులు, స్నేహితులు వంశీ, రాము,విజయ్ లు ఎమ్మెల్యే బి.వి జయనాగేశ్వర రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మానవతాదృక్పథం తో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే బి.వి.జయ నాగేశ్వర రెడ్డిని క్రీడాభిమానులు అభినందించారు.

# అయ్యప్ప స్వామి ఆలయంలో 11వ రోజు బిక్ష దాతలుగా వాగు నరసింహారావు దంపతులు ,అంకం రాంబాబు దంపతులు.



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏలూరు జిల్లా ,జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీహరి హరసత అయ్యప్ప స్వామి , దేవస్థానంలో 11 వ రోజు బిక్ష దాతలుగా జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు వాగు నరసింహారావు శ్రీదేవి దంపతులు సరిపల్లి వాస్తవ్యులు అంకం రాంబాబు స్వామి జరిపించారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతిరోజు అయ్యప్ప స్వామి భక్తులకు నిత్యా అన్నదానం ఏర్పాటు చేశామని భక్తులందరూ ఈ సదా అవకాశాన్ని వినియోగించుకుంటున్నారని , ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి, కోశాధికారి కూన పార్వతి గుంట్ల వెంకటేశ్వరరావు, కొర్లే పర కృష్ణారావు, తమ్మన వెంకటేశ్వరరావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు, ఆలయ మేనేజర్ గణేష్ రెడ్డి, వచ్చిన భక్తులకు అన్ని సదుపాయాలు కలగజేశారు .

# ఎమ్మిగనూరు లో ఘనంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)శోభయాత్ర



**హైదరాబాద్ పెన్ పవర్:**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)ఎమ్మిగనూరు నగరశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక కుర్ణి కళ్యాణ మండపం నుండి జిల్లా నలుమూలల నుంచి వచ్చినటువంటి ఏబీవీపీ కార్యకర్తలతో మాచాని సోమప్ప సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు శోభాయాత్ర తో వెళ్ళి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంనకు ముఖ్య అతిథులు గా పాల్గొన్న ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాము మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తూ సమాజంలో ఉన్నటువంటి కులాలను కుళ్ళును తుడిచే విధంగా విద్యార్థి పరిషత్ కార్యకర్తలు విద్యార్థి దశ నుంచే సమాజ హితం కోసం సంఘటిత శక్తి కోసం దేశ రక్షణ కోసం విద్యార్థి దశ నుంచే అనేక లక్షణాలు అలవర్చుకొని సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలను రూపుమాపుతూ సమాజ హితం కోసం పనిచేసేటువంటి వ్యక్తులను తయారు చేయడం ఎబివిపి యొక్క లక్ష్యమని తెలిపారు.వ్యక్తి నిర్మాణం తద్వారా సమాజ నిర్మాణం జరుగుతుందని, విద్యార్థి పరిషత్ ప్రారంభ దశ నుంచే లక్షణాలు అలవర్చుకోవాలని తెలిపారు. కర్నూల్ విభాగ్ కన్వీనర్ ఎర్రి స్వామి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చినటువంటి విద్యార్థి పరిషత్ కార్యకర్తలు రెండు రోజులుగా శిక్షణ తరగతులలో పాల్గొని నేటి బాలురు - నేటి పౌరులు అనేటువంటి నినాదంతో విద్యార్థి పరిషత్ నిరంతరంగా పనిచేస్తుందన్నారు. అటువంటి శిక్షణ తరగతులు రెండు రోజులుగా ప్రాంతం నుంచి అనేక మంది పాల్గొని విద్యార్థులకు దిశ నిర్దేశం చేయడం జరిగిందని,అటువంటి శిక్షణ తరగతులు పూర్తిచేసుకుని ర్యాలీగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడం జరిగిందని తెలిపారు. సమాజంలో మహోన్నతమైనటువంటి వ్యక్తులను విద్యార్థి పరిషత్ ఎప్పటికీ స్మరిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో కర్నూలు జిల్లా సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్, కర్నూలు జిల్లా కన్వీనర్ వీరేష్,నంద్యాల జిల్లా కన్వర్ యుగంధర్ , శ్రీనివాసులు, మారుతి తదితరులు పాల్గొన్నారు.


## కొడిదల రాములు చిత్రపటానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**హైదరాబాద్ పెన్ పవర్:**గూడూరు మండల మాజీ జడ్పీటీసీ కొడిదల సంజయ్ కుమార్ తండ్రి కొడిదల రాములు ఇటీవలే మరణించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి వారికి ప్రగడ సానుభూతి తెలియజేసిన మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధవపెద్ది రమేష్ చందర్ రెడ్డి, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వాంకుడోత్ కొమ్మలు నాయక్ గూడూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి,నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి,జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ చంటి స్వామి, గూడూరు మాజీ ఉపసర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి శివరాత్రి సంపత్, మండల నాయకులు బుడిగి సతీష్,ఓర్సు బిక్షపతి గూడూరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాసమల్ల యాకయ్య, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండి రసూల్,మండల నాయకులు మాదాసు రమేష్,మండల కార్యదర్శి సుర గంగయ్య, మండల నాయకులు లింగాల యాదవ రెడ్డి,సీనియర్ నాయకులు శక్రు నాయక్, వెంకన్న,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# లాంగ్ కోవిడ్... ప్రతి ముగ్గురిలో ఒకరికి అరుదైన గుండె జబ్బు

- లాంగ్ కోవిడ్ బాధితుల్లో అరుదైన గుండె సమస్య గుర్తింపు
- 'పాట్స్' అనే రుగ్మత బారిన పడుతున్నారని స్వీడన్ పరిశోధనలో వెల్లడి
- మధ్యవయస్కులైన మహిళల్లోనే ఈ సమస్య అధికం
- నిలబడినప్పుడు గుండె వేగం అసాధారణంగా పెరగడమే ప్రధాన లక్షణం
- సులభమైన పరీక్షలతో వ్యాధిని గుర్తించవచ్చన్న నిపుణులు




**హైదరాబాద్ పెన్ పవర్:**లాంగ్ కోవిడ్‌తో బాధపడుతున్న వారిలో, ముఖ్యంగా మధ్యవయస్కులైన మహిళల్లో ఒక అసాధారణ గుండె సంబంధిత రుగ్మత ఎక్కువగా కనిపిస్తోందని స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు జరిపిన తాజా అధ్యయనంలో తేలింది. 'పోస్చురల్ ఆర్థోస్టాటిక్ టాకీకార్డియా సింగ్రోమ్' (పాట్స్) అనే ఈ సమస్య లాంగ్ కోవిడ్ రోగులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్లు వెల్లడైంది. 'పాట్స్' అనేది పడుకున్న స్థితి నుంచి నిలబడినప్పుడు గుండె వేగం అసాధారణంగా పెరిగే ఒక రకమైన ఆరోగ్య సమస్య. ఈ రుగ్మతతో బాధపడేవారికి నిలబడటం కూడా చాలా కష్టంగా ఉంటుంది. తీవ్రమైన అలసట, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు వీరిలో కనిపిస్తాయి. ఇవి లాంగ్ కోవిడ్ లక్షణాలను పోలి ఉండటం గమనార్హం. ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసేందుకు పరిశోధకులు, కోవిడ్ కారణంగా ఆసుపత్రిలో చేరని 467 మంది లాంగ్ కోవిడ్ బాధితులపై పరిశోధనలు చేశారు. వీరిలో 91 శాతం మంది గతంలో ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్న మధ్యవయస్కులైన మహిళలే. అధ్యయనం ముగిసేసరికి, వీరిలో దాదాపు 31 శాతం మందికి 'పాట్స్' ఉన్నట్లు నిర్ధారణ అయింది. మరో 27 శాతం మందిలో ఈ వ్యాధి లక్షణాలు కనిపించినా, పూర్తిస్థాయిలో నిర్ధారణ కాలేదు.

ఈ పరిశోధన ఫలితాలపై కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మికాయిల్ బ్యోర్న్‌సన్ మాట్లాడుతూ, "లాంగ్ కోవిడ్ రోగులలో 'పాట్స్' అనేది చాలా సాధారణ సమస్య అని మేం ఇప్పుడు కచ్చితంగా చెప్పగలం. ఈ సమాచారం వైద్యులకు, రోగులకు ఎంతో విలువైనది" అని తెలిపారు. అదే సంస్థకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ జూడిత్ బ్రుచ్‌ఫెల్డ్ మాట్లాడుతూ, "పాట్స్‌ను తక్కువ ఖర్చుతో కూడిన సులభమైన పరీక్షల ద్వారా అన్ని స్థాయిల ఆరోగ్య కేంద్రాల్లో గుర్తించవచ్చు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి, లక్షణాలను తగ్గించి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చికిత్సలు కూడా అందుబాటులో ఉన్నాయి" అని వివరించారు. లాంగ్ కోవిడ్ బారినపడి, నిలబడినప్పుడు గుండె వేగం పెరగడం, తలతిరగడం, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే 'పాట్స్' పరీక్ష చేయించుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# గర్భిణీలకు డెంగ్యూ ఫీవర్ వస్తే.. పుట్టబోయే బిడ్డపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది..!

**హైదరాబాద్ పెన్ పవర్:**డెంగ్యూ కేసులు పెరుగుతున్నందున జ్వరం, శరీరంలో దద్దుర్లు, కంటి నొప్పి, కండరాలు, కీళ్ల లేదా ఎముకల నొప్పులు, వాంతులు, వికారం మొదలైన లక్షణాలను నిశితంగా గమనించాలి. కాబోయే తల్లులకు ఇది చాలా ముఖ్యం. దోమ కాటు ప్రమాదాన్ని తగ్గించడానికి పొడవాటి చేతులతో కూడాన చొక్కాలు, పొడవాటి ప్యాంటు ధరించడం ఉత్తమం. గర్భధారణ సమయంలో పెరుగుతున్న పిండానికి మద్దతుగా రోగనిరోధక వ్యవస్థలో మార్పులు సంభవిస్తాయి.




**గర్భిణీ స్త్రీలు డెంగ్యూ వంటి ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం..**

దోమల ద్వారా వ్యాపించే వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతున్న డెంగ్యూ జ్వరం విషయంలో గర్భిణీ స్త్రీలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. . ఎంగర్భధారణ సమయంలో పెరుగుతున్న పిండానికి మద్దతుగా రోగనిరోధక వ్యవస్థలో మార్పులు సంభవిస్తాయి. గర్భిణీ స్త్రీలు డెంగ్యూ వంటి ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం ఉంది. ఇది కాకుండా గర్భధారణ సమయంలో హార్మోన్ల మార్పులు కూడా వ్యాధి సోకితే వ్యాధి తీవ్రతను ప్రభావితం చేస్తాయి. అదే సమయంలో గర్భధారణ సమయంలో డెంగ్యూ సంక్రమణ తల్లి, బిడ్డ ఇద్దరికీ సమస్యలను కలిగిస్తుంది. అకాల పుట్టుక, తక్కువ జనన బరువు, పిండం మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంది. గర్భధారణ సమయంలో, పెరుగుతున్న పిండానికి మద్దతుగా రోగనిరోధక వ్యవస్థ మార్పులకు లోనవుతుంది, గర్భిణీ స్త్రీలు డెంగ్యూ వంటి ఇన్ఫెక్షన్ల బారిన పడతారు. అదనంగా, గర్భధారణ సమయంలో హార్మోన్ల మార్పులు కూడా సోకితే వ్యాధి తీవ్రతను ప్రభావితం చేస్తాయి. డెంగ్యూ అనేది ఫ్లావివిరిడే, జెనస్ ఫ్లావివైరస్ కు చెందిన దోమల ద్వారా సంక్రమించే వ్యాధి. ఈ దోమ మానవ శరీరంలో రక్తాన్ని పీల్చిన తరువాత రక్తప్రవాహంలోకి వైరస్ ప్రవేశించిన తరువాత వ్యాధి సోకుతుంది. ఈ దోమలు సాధారణంగా పగటిపూట కుడతాయి. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం కూడా ఉంది. గర్భిణీ స్త్రీకి వ్యాధి గర్భధారణ సమయంలో లేదా ప్రసవ సమయంలో వైరస్ సోకినట్లయితే అది తన బిడ్డకు కూడా వ్యాపిస్తుంది.

**డాక్టర్‌ని ఎప్పుడు సంప్రదించాలి ?**

వ్యాధి సోకిన గర్భిణీ స్త్రీలు డెంగ్యూ పాజిటివ్ అని తేలితే తప్పనిసరిగా వైద్య సలహా తీసుకోవాలి. డెంగ్యూ వైరస్ గర్భవతిగా ఉన్నప్పుడు, ప్రసవ సమయంలో శిశువుకు సంక్రమించినా, అది చాలా అరుదుగా శిశువు మీద ప్రభావం చూపుతుంది. వైరస్‌ను త్వరగా గుర్తించడం, సకాలంలో వైద్య సహాయం కోరడం వలన బిడ్డను తల్లిని సురక్షితంగా కాపాడుకోవచ్చు. డెంగ్యూ సోకిన వారికి చికిత్స మామూలు వ్యాధిగ్రస్థులకు ఇచ్చే విధంగానే ఉంటుంది. అయితే డెంగ్యూ లక్షణాలు ఉన్నవారితో మసిలేవారు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమ కాటు నుంచి రక్షించుకునే జాగ్రత్తలు అవసరం. నిండుగా చేతులున్న దుస్తులు ధరించడం, దోమలు తిరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

**ప్లేట్‌లెట్స్ వేగంగా తగ్గుతాయి**

గర్భిణీతో ఉన్న మహిళలు ఎంతో పుష్టిగా ఉండాలి. లోపల ఉన్న పిండానికి రక్తం కూడా అవసరం . శరీరంలో రక్తం ప్రవహించడానికి ప్లేట్‌లెట్స్ అవసరం. కానీ డెంగ్యూ తీవ్రమైన స్థితికి చేరితే ప్లేట్‌లెట్‌లు వేగంగా తగ్గడం ప్రారంభిస్తాయి. ఆరోగ్యవంతమైన వ్యక్తి శరీరంలో 1.5 లక్షల నుంచి నాలుగు లక్షల ప్లేట్‌లెట్‌లు ఉంటాయి. అది దాదాపు 20 వేలకు చేరితే అప్పుడు రక్తస్రావం మొదలవుతుంది. అలాగే ప్లేట్‌లెట్లను ఎక్కించాల్సి ఉంటుంది. డెంగ్యూ ప్రమాదకరంగా మారితే అవయవాలు ఫెయిల్ అయ్యే ప్రమాదం కూడా పెరుగుతుంది. ఇంట్లో దోమలోకి ప్రవేశించకుండా కిటికీలు, తలుపులు కవర్ చేయండి. పూర్తి స్లీవ్‌లతో కూడిన బట్టలు ధరించండి.

**డెంగ్యూ నివారణ మార్గాలు**

తెల్లవారుజామున మరియు సంధ్యా సమయంలో దోమలు చాలా చురుకుగా ఉంటాయి. గర్భిణీ స్త్రీలు ఈ సమయాల్లో బహిరంగ కార్యకలాపాలకు దూరంగా ఉండాలి . కిటికీలకు, తలుపులకు ఐరన్? మెష్? లాంటి ఏర్పాటు చేసుకోవాలి. దోమల నుండి రక్షణ: దోమ కాటును నివారించడానికి, ప్రధానంగా దోమ కాటును నివారించడానికి చర్యలు తీసుకోండి. బయటకు వెళ్లేటప్పుడు, నిద్రిస్తున్నప్పుడు దోమల నివారణ మందు వాడండి.

డెంగ్యూ దోమలు వృద్ధి చెందడానికి నీరు నిలిచిన ప్రదేశాలను శుభ్రంగా ఉంచండి. పాత్రలు, కూలర్లు, ఇతర ప్రదేశాలలో నీరు చేరకుండా జాగ్రత్త వహించండి. సమయానుసారంగా వీలైనన్ని ఎక్కువ పూర్తి దుస్తులను ధరించడానికి ప్రయత్నించండి.

డెంగ్యూ రాకుండా ఉండేందుకు సౌకర్యవంతమైన మరియు పొడవాటి చేతుల దుస్తులు ఉత్తమం.

డెంగ్యూ దోమల వృద్ధికి స్వచ్ఛమైన, స్వచ్ఛమైన నీరు అవసరం. మీ పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను శుభ్రం చేయండి.

మీ ఇంటిని శుభ్రంగా, శుభ్రంగా ఉంచుకోవడం వల్ల డెంగ్యూ వంటి వ్యాధుల దోమలు వృద్ధి చెందే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నీటి నిల్వ స్థలాలను ఖాళీగా ఉంచండి. తద్వారా దోమలు వృద్ధి చెందడానికి ఎక్కువ అవకాశాలు ఉండవు.